క్లుప్తంగా

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్ అందజేస్తున్న బీఎల్ఆర్ బ్రదర్స్

మిర్యాలగూడ: పట్టణంలోని గీతామందిర్ కాలనీకి చెందిన ముచ్చర్ల మనీష్‌కుమార్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. నిరుపేద విద్యార్థి కావడంతో ఉన్నత చదువు కోసంగాను బీఎల్ఆర్ బ్రదర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బత్తుల సాయిప్రసన్నకుమార్, బత్తుల ఈశ్వరగణేష్ అతడికి బుధవారం ల్యాప్‌టాప్ అందజేశారు.

పేద విద్యార్థికి ఆర్థిక చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న విద్యాసాగర్‌రెడ్డి

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లికి చెందిన కూరాకుల అశ్విని ఈసెట్ ద్వారా రాష్ట్ర స్థాయిలో 190వ ర్యాంక్ సాధించి సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఉచిత సీటు సాధించింది. నిరుపేద విద్యార్థి కావడంతో హాస్టల్ ఖర్చుల నిమిత్తం ఎన్ఆర్ఐ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పిన్నపురెడ్డి విద్యాసాగర్‌రెడ్డి బుధవారం విద్యార్థినికి రూ.60వేల ఆర్థికసాయం అందజేశారు.

ఆర్థికసాయం అందజేత

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీలోని ఆరవ వార్డుకు చెందిన దొంతాల కృష్ణకిషోర్ గతేడాదిగా పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న వంశీభరత్ నినన్(వీబీఎస్)సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన నినన్ అతడికి చికిత్స నిమిత్తం బుధవారం రూ.5వేల ఆర్థికసాయం చేశారు. ఆయన వెంట దేవేందర్, రామకృష్ణ, భాస్కర్, శివ తదితరులున్నారు.

ఎర్ర రవి మృతి ఏఐఎస్ఎఫ్‌కు తీరనిలోటు



నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

చింతపల్లి: ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు ఎర్ర రవి మరణం సంఘానికి తీరని లోటని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ అన్నారు. రవి వర్ధంతి సందర్భంగా బుధవారం చింతపల్లిలో ఆయన స్థూపానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. విద్యార్థుల హక్కుల సాధనకు, వారి సమస్యల పరిష్కారానికి రవి ఎంతగానో కృషిచేశారన్నారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర కిరణ్, ఎర్ర చిన్న, నల్ల సతీష్, అశోక్, మనోహర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం వరద బాధితులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న జయరాం

త్రిపురారం: ఖమ్మం జిల్లాలోని వరద బాధితులకు త్రిపురారం ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈమేరకు బుధవారం త్రిపురారం పీఏసీఎస్ చైర్మన్ ధనావత్ జయరాం కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ స్వచ్ఛ భారతికి ఈ సాయాన్ని అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకట్ రెడ్డి, సైదా నాయక్, సైదులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఉత్తరాలు

మిర్యాలగూడ టౌన్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరుతూ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలను పంపించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఫీజురీయింబర్స్‌మెంట్‌తో అనేక మంది విద్యావంతులుగా మారుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా.. ఇప్పటివరకు ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి గంగాధర్, నర్సింహ, మురళియాదవ్, నరేష్, శైలేందర్, రాములు, సైదానాయక్ తదితరులున్నారు.



ఉత్తరాలను పంపుతున్న నాయకులు

కొత్త టీచర్లు వచ్చేశారు



మిర్యాలగూడ ఎమ్మార్సీ వద్ద ఉపాధ్యాయులకు జాయినింగ్ ఆర్డర్లు అందజేస్తున్న ఎంఈఓ



గుర్రంపోడు మండల విద్యాధికారికి రిపోర్టు చేస్తున్న నూతన ఉపాధ్యాయులు

● విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలానికి వచ్చిన 17 మంది నూతన ఉపాధ్యాయులకు బుధవారం మండల విద్యాధికారి బాలునాయక్ ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పట్టుదలతో పని చేసి పాఠశాలలకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు మునగాల రామిరెడ్డి, అనుముల సైదిరెడ్డి, రమేష్, మచ్చ రఘు, ధనావత్ అరుణ ఉన్నారు.

గుర్రంపోడు: గుర్రంపోడు మండలంలో నూతనంగా ఎనిమిది మంది టీచర్లు బుధవారం విధుల్లో చేరారు. ఎమ్మార్సీలో మండల విద్యాధికారి నోముల యాదగిరి వారికి ఆహ్వానం పలికారు. విధుల్లో చేరిన వారిలో పెద్దిరెడ్డి సతీష్ రెడ్డి (కోయగూరవానిబావి), సంపత్‌కుమార్ (తానేదార్‌పల్లి), రవి(జూనూతుల), ఎస్. శివ(కోనాయిగూడెం), సీహెచ్. శివకుమార్ (వట్టికోడు), గిరిబాబు (మక్కపల్లి), నరేష్ (గుర్రంపోడు), అనిత (లక్ష్మీదేవిగూడెం) ఉన్నారు.

పెద్దవూర మండలంలో 17 మంది..

పెద్దవూర: పెద్దవూర మండలానికి మొత్తం 17 మంది నూతన ఉపాధ్యాయులు వచ్చినట్లు మండల విద్యాధికారి తరి రాములు తెలిపారు. వారు తమకు కేటాయించిన పాఠశాలల్లో బుధవారం రిపోర్టు చేశారు. మండలానికి మొత్తం 10 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులను కేటాయించగా బుధవారం తొమ్మిదిమంది రిపోర్టు చేశారని చెప్పారు. ఏడుగురు స్కూల్ అసిస్టెంట్‌లు రాగా వీరిలో నలుగురు రిపోర్టు చేసినట్లు తెలిపారు. నూతన ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దండ వీరారెడ్డి, మహేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వడ్లపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి స్వాగతం పలికారు.

అడవిదేవులపల్లి మండలంలో 12 మంది..

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లో 12 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. వీరికి బుధవారం మండల విద్యాధికారి వరలక్ష్మి జాయినింగ్ ఆర్డర్ అందజేశారు. ఉల్సాయిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలకు ఇద్దరు, బాల్నెపల్లి, ముదిమాణిక్యం ప్రాథమికోన్నత పాఠశాలలకు ఒక్కొక్కరు, కొత్తనందికొండ, గందేవానితండా, బంగారికుంటతండా, అడవిదేవులపల్లి ప్రాథమిక పాఠశాలకు ఒక్కరు చొప్పున విధుల్లో చేరారు.

సొంత మండలంలోనే పోస్టింగ్



గుర్రంపోడు: సొంత మండలంలోనే ఉపాధ్యాయుడిగా పోస్టింగ్ వచ్చింది. మా ఊరికి దగ్గర్లోని కోనాయిగూడెం పాఠశాలలో పోస్టింగ్ దొరకడం అదృష్టంగా భావిస్తున్నా. మా కొప్పోలు గ్రామంలోనే ఇద్దరికి డీఎస్సీలో ఉద్యోగాలు రాగా ఇద్దరికీ సొంత మండలంలోనే పనిచేసే అవకాశం లభించింది.

– నల్లబోతు శివ, కొప్పోలు

విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలి

త్రిపురారం: ఉపాధ్యాయులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలని త్రిపురారం ఎంఈఓ రవి నాయక్ అన్నారు. త్రిపురారం మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించిన నూతన ఉపాధ్యాయులకు బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. కార్యక్రమంలో శివ శంకర్, దశరథ, ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, విష్ణు కుమార్, వెంకట్, సతీష్, పాండరి, శివయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రొసీడింగ్ కాపీలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): నూతన ఉపాధ్యాయులకు బుధవారం మండల విద్యాధికారి కె.శ్రీనివాస్ ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. కార్యక్రమంలో నెల్లికల్ హెచ్ఎం సుహాసిని, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, నాయకులు జార్జ్, చిరమల్లయ్య, పరశురాంగౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రుల శంకుస్థాపన



పెద్దవూరలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి

పెద్దవూర: పెద్దవూర మండలంలో రూ.36 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు బుధవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. పెద్దగూడెం స్టేజీ నుంచి అన్నారం రోడ్డు వరకు 15 కిలోమీటర్ల రహదారికి రూ.11 కోట్లు, వెల్మగూడెం గ్రామం నుంచి గుర్రంపోడు మండలం చేపూరు వరకు 35 కిలోమీటరు నుంచి 49వ కిలోమీటరు వరకు 14 కిలోమీటర్ల దూరం రోడ్డు విస్తరణకు రూ.25 కోట్లు మంజూరైనట్లు మంత్రులు తెలిపారు. కార్యక్రమంలో సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడెం సబ్ కలెక్టర్ నారాయణన్ అమిత్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, నాయకులు పబ్బు యాదగిరి, గడ్డంపల్లి వినయ్‌రెడ్డి, చామల సువర్ణ, మల్లారెడ్డి, దామోదర్‌రెడ్డి, ధర్మారెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ యాకూబ్, ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా రాజశేఖర్‌నాయక్

మిర్యాలగూడ టౌన్: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా మిర్యాలగూడకు చెందిన న్యాయవాది ధనావత్ రాజశేఖర్‌నాయక్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి బుధవారం నియామక పత్రం అందజేశారు. తన నియమకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నర్సింహారెడ్డి, సాధినేని శ్రీనివాస్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక సాంబయ్యకు రాజశేఖర్‌నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

పత్తిని దళారులకు అమ్మి మోసపోవద్దు



సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి: రైతులు పత్తిని దళారులకు అమ్మి మోసపోవద్దని, నేరుగా సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం గుడిపల్లి మండలం చిల్కమర్రి పరిధిలోని శ్రీ తిరుమల కాటన్ మిల్లులో సీసీఐ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునామాధవరెడ్డి, మార్కెట్ కార్యదర్శి కిరణ్‌కుమార్, సీసీఐ ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాన్, జాల నర్సింహారెడ్డి, తిలక్‌రెడ్డి, వేణుధర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఎల్లయ్య తదితరులున్నారు.

రైతులకు చేదోడు వాదోడుగా ఉంటా



ప్రమాణస్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న మార్కెట్ నూతన చైర్మన్ అంకతి సత్యం



వైస్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న బుసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

● నిడమనూరు మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ అంకతి సత్యం

త్రిపురారం: రైతులకు చేదోడు వాదోడుగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందే విధంగా కృషి చేస్తానని నిడమనూరు మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ అంకతి సత్యం అన్నారు. బుధవారం నిడమనూరు మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మార్కెట్ చైర్మన్‌గా ఆయన, వైస్ చైర్మన్‌గా త్రిపురారం మండలంలోని దుగ్గెపల్లి గ్రామానికి చెందిన బుసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లుగా మన్నెం శంకర్, పాల్వాయి చంద్ర శేఖర్ రెడ్డి, మెండె వెంకటేశ్వర్లు, వంగాల అనీల్ కుమార్ రెడ్డి, సపావత్ శ్రీను, ఎండీ యాకూబ్ అలీ, పాలగాని పరుశరాం, అనుముల మంజుల, కూరపాటి సైదులు, గంగుల గురువయ్య, రేపాల మధుసూదన్, అశోక్‌లు ప్రమాణం స్వీకారం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వీరితో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ అంకతి సత్యం మాట్లాడుతూ.. రైతుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ నారాయణ రెడ్డి, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, నిడమనూరు, త్రిపురారం మండలాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి

● మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్



పారిశుద్ధ్య కార్మికులకు వీల్ బారోలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్య సిబ్బందితో పాటు పట్టణ ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులకు చెత్త ఎత్తే వీల్ బారోలను అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన పరికరాలు అందజేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, కౌన్సిలర్లు తిరునగరు నాగలక్ష్మిభార్గవ్, అమృతం దుర్గసత్యం, కుర్ర చైతన్య, పోదిల చంద్రకళ, సాధినేని శ్రవంతి శ్రీనివాస్‌రావు, తలకోల సుజాత, సాదేఖాబేగం, మల్లం రమేష్, ఎంఏ సలీం, బంటు రమేష్, చిలుకూరి రమాదేవిశ్యాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, నాగరాజు, సాధిక్ అలీ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల జోలికి వస్తే సహించం

● ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



హరిప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మిర్యాలగూడ: కాంగ్రెస్ కార్యకర్తల జోలికి వస్తే సహించబోమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. దామరచర్ల మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకుల దాడిలో గాయపడిన ఎన్ఎస్‌యుఐ నాయకుడు హరిప్రసాద్ మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హరిప్రసాద్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

పాఠశాలలకు దాతల సహకారం అభినందనీయం



మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ గవర్నర్ ప్రభాకర్‌రెడ్డి

హాలియా: ప్రభుత్వ పాఠశాలలకు దాతలు సహకారం అందించడం అభినందనీయమని యాచారం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సిరిగిరి నాగిరెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ స్నేహ సౌజన్యంతో అనుముల మండలంలోని యాచారం జెడ్పీ ఉన్నత పాఠశాలకు సుమారు రూ.70 వేల విలువ గల 10 డ్యూయల్ డెస్క్ బెంచీలు, లైబ్రరీ ర్యాక్, బీరువా, వాలీబాల్ నెట్, టెన్నికాయట్ రింగ్స్, స్కిప్పింగ్ రోప్స్ పంపిణీ చేశారు. అనంతరం డిస్ట్రిక్ట్ 320ఈ గవర్నర్ యారాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధి కోసం తమవంతుగా తోడ్పాటునందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఎంజేఎఫ్ శివ శంకర్ రావు, సింహాద్రి, డిస్ట్రిక్ట్ కేబినేట్ సెక్రటరీ లయన్ రేపాల మాదన్ మోహన్, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ లయన్ గడ్డం ప్రదీప్‌కుమార్, నామణిరెడ్డి, శంకర్‌రెడ్డి, రేపాల విజయలక్ష్మి, బండారు పుష్ప, చంద్రావతి పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి



రవీందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

చింతపల్లి: గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూల రవీందర్ గౌడ్ అన్నారు. బుధవారం చింతపల్లిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్ యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అయిందన్నారు. కాంగ్రెస్ పార్టీపైన ప్రజల్లో పూర్తి వ్యతిరేకత వచ్చేసిందన్నారు. సమావేశంలో ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లాలు నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, మాజీ సర్పంచ్ బ్రహ్మచారి, నగేష్, మధు, శేఖర్, మహమ్మద్ జాంగిర్ భాయ్, బొడ్డు మహేష్ గౌడ్, కుందేళ్ళ శ్రీశైలం యాదవ్, గజ్జె అభినవ్ గౌడ్, రాజు, పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి



ఐద్వా మహాసభలో మాట్లాడుతున్న నల్లా వెంకటయ్య

దేవరకొండ: మహిళల కోసం తెచ్చిన ప్రత్యేక రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిమ్మల పద్మ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్లా వెంకటయ్య కోరారు. బుధవారం దేవరకొండలో నిర్వహించిన ఐద్వా మహాసభలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం 11మందితో కూడిన మహిళా సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తోట రమణ, లింగంపల్లి అనిత, జ్యోతి, అలివేలు, ధనలక్ష్మి, సైదమ్మ, రేణుక, అంజమ్మ, వినోద తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ చేశాకే ఎన్నికలకు వెళ్లాలి



మాట్లాడుతున్న పాలడుగు ప్రభావతి

మిర్యాలగూడ అర్బన్: మహిళా రిజర్వేషన్ చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పాలడగు ప్రభావతి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన ఐద్వా మండల కమిటీ మహాసభలో వారు మాట్లాడారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. మహిళా భరోసా రూ.2500 అమలు చేయాలని, బస్సుల సంఖ్య పెంచాలని, డ్వాక్రా గ్రూపులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని కోరారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. మహిళా రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. కేరళ తరహా రేషన్ షాపుల ద్వారా 14రకాల నిత్యావసర సరుకులు అందించాలన్నారు. మహిళల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ఆరోపించారు. అనంతరం పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు గాదె పద్మమ్మ, మాదవి, అరుణ, నాగమణి, పుల్లమ్మ, కంచర్ల ఊర్మిళ, పాదూరి గోవర్ధన, దరావత్ మంగ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తుల పంపిణీ



ఓటరు నమోదు చేసుకున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తులను పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొంగరి సత్యనారాయణ, నాయకులు జార్జ్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీరాం, పరశురాంగౌడ్, కూన్‌రెడ్డి సైదిరెడ్డి, భానునాయక్, అమృతయ్య, శైలజ, సరోజినిదేవి, గౌసియా, రాములు పాల్గొన్నారు.

కులగణన సర్వేలో ముదిరాజ్‌గా నమోదు చేయించుకోవాలి

మిర్యాలగూడ టౌన్: త్వరలో జరగనున్న కులగణన సర్వేలో ముదిరాజ్‌లు ఉప కులాల పేర్లు కాకుండా ముదిరాజ్ అని నమోదు చేయించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఆర్గనైజింగ్ కోల సైదులు అన్నారు. పట్టణానికి చెందిన పలువురు ముదిరాజ్‌లు బుధవారం హైదరాబాద్‌లో సంఘ సేవకుడు అంబర్‌పేట శంకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కోల సైదులు మాట్లాడుతూ.. ముదిరాజ్ అని సర్వేలో నమోదు చేయించుకుంటే ముదిరాజ్‌ల జనాభా ఎంత ఉందో తెలుస్తుందన్నారు. వుప్పరి నారాయణ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నూతి చలపతిముదిరాజ్, నర్సింహ తదితరులున్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు శిక్షణ

తిరుమలగిరి(నాగార్జునసాగర్): గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం తిరుమలగిరి మండలంలోని కొంపెల్లి రైతువేదికలో బుధవారం ప్రారంభమైంది. మొదటి రోజు పంపుసెట్, స్టార్టర్‌ల మరమ్మతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇంట్రా ఏఈ ప్రదీప్‌రెడ్డి, హెల్పర్స్, వాటర్ క్వాలిటీ ల్యాబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మిర్యాలగూడ టౌన్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ మండలం ఎర్రావులపాడు గ్రామంలో బుధవారం జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రావులపాడు గ్రామానికి చెందిన పరిక గోపాల్(44) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన నామ అరుణ్‌కు చెందిన వ్యవసాయ మోటారు పనిచేయకపోవడంతో మోటారు మెకానిక్‌గా అనుభవం ఉన్న గోపాల్‌ను పొలం వద్దకు తీసుకెళ్లాడు. మోటారు బాగుచేసే క్రమంలో గోపాల్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ వైర్లు సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గ్రామస్తులు వెంటనే గోపాల్‌ను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య రఘునాథమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, ప్రైవేట్ యాజమాన్యాలు

దేవరకొండ: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం దేవరకొండ, కొండభీమనపల్లి మండలాల ప్రైవేట్ డిగ్రీ, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు చేపట్టిన బంద్‌కు వారు మద్దతు తెలిపి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల అసోసియేషన్లతో ప్రభుత్వం చర్చలు జరిపి విద్యార్థుల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాల ప్రైవేట్ డిగ్రీ, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తెల్దేవర్‌పల్లిలో వైద్య శిబిరం

చందంపేట: మండలంలోని తెల్దేవర్‌పల్లి గ్రామంలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని చిత్రియాల పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి ప్రారంభించారు. పలు గ్రామాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సత్యనారాయణ, మల్లయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మిర్యాలగూడ అర్బన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని ఏడుకోట్లతండా వద్ద బుధవారం చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. నర్సారావుపేటకు చెందిన బండారు హరిబాబు తన ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఏడుకోట్లతండా వద్ద సిబ్బంది వాహనం అడ్డుగా ఉంచి హైవే పనులు నిర్వహిస్తున్నారు. వీరి వాహనాన్ని గమనించని హరిబాబు వేగంగా వచ్చి నిలిపి ఉంచిన వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సాయంతో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచనల మేరకు నర్సారావుపేటకు తరలించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు.